ఢిల్లీ నేస్తం.. అవినీతి హస్తం

అనుమతి లేకుండా సీతారామ టెండర్లా?

- ప్రజాపాలన అంటే ఇదేనా?
- సుద్దపూస ముచ్చట్లు చెప్పి ఇప్పుడు నిబంధనలు తుంగలో తొక్కుతరా?
- మత్స్యకారుల జీవితాల్లో సర్కార్ మట్టి
- మూసీ మురుగులో కోట్లు కుమ్మరిస్తారు.. జలాశయాల్లో చేపపిల్లలు వదలరా?
- మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : అనుమతులు లేకుండానే సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రూ.1074 కోట్ల పనులకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ఢిల్లీ నేస్తం.. అవినీతి హస్తం' అంటూ ఆదివారం ఎక్స్ వేదికగా నిప్పులు చెరిగారు. 'అంచనాలు పెంచారని హాహాకారాలు చేసినోళ్లు.. అవినీతి జరిగిందని బురదజల్లినోళ్లు.. కాళేశ్వరం మీద కక్షగట్టి రైతుల పొట్టగొట్టినోళ్లు.. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల మీద పగబట్టి మళ్లీ వలసలకు పచ్చజెండా ఊపినోళ్లు.. తెలంగాణ ప్రాజెక్టుల మీద విషం కక్కి రాష్ట్రాన్ని ఆగంపట్టించినోళ్లు, ప్రజాపాలన అంటూ పొద్దుకు పదిమార్లు ప్రగల్భాలు పలికేటోళ్లు.. సీతారామ ఎత్తిపోతల పథకంలో అనుమతులు లేకుండానే రూ.1074 కోట్ల పనులకు టెండర్లు ఎట్ల పిలిచిండ్రు?' అంటూ నిలదీశారు. 'సుద్దపూస ముచ్చట్లు చెప్పే టోళ్లు ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీల పనుల్లో నిబంధలను ఎలా తుంగలో తొక్కారు' అని ప్రశ్నించారు. ఒక మీటింగ్‌లో త్వరగా టెండర్లు పిలవాలని ఆదేశాలివ్వడం.. మరో మీటింగ్‌లో ఇదేం టంటూ నంగనాచి మాటలు చెప్పడమేమిటని విమర్శించారు. 'ప్రాజెక్టు పూర్తయ్యి కోటి ఏకరాలకు జీవం పోస్తున్న కాళేశ్వరంపై కమిషన్లు వేసి విచారణ చేయిస్తున్న మీపై ఇప్పుడు ఏ కమిషన్ వెయ్యాలి?' అంటూ నిప్పులు చెరిగారు. సీతారామ టెండర్లకు సంబంధించి పలు పత్రికల్లో వచ్చిన కథనాలను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

నడుమంత్రపు పాలనలో నీలివిప్లవం నెరైలు

మత్స్యకారుల జీవితాల్లో రేవంత్‌రెడ్డి సర్కారు మట్టికొట్టిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. నడుమంత్రపు పాలనలో నీలి విప్లవం నెరైలుబారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో చేపల కథ ముగిసిన అధ్యాయమేనా? అని ప్రశ్నించారు. మత్స్య సంపదపై ఇందిరమ్మ రాజ్యం కక్షగట్టిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఏటా 20 వేల టన్నుల దిగుబడి వచ్చిన మత్స్యపంట కాంగ్రెస్ సర్కారు కండ్లమంటకు నీటిమూట అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'ప్రభుత్వం మారితే పథకాల పేర్లు మారుతాయి. కానీ, కాంగ్రెస్ పాలనలో పథకాలే నామరూపాల్లేకుండా పోయాయి' అని ఎద్దేవాచేశారు. మూసీ మురికిలో కోట్లు కుమ్మరించడంపై ఉన్న ప్రేమ జలాశయాల్లో చేపపిల్లలు వదలడంలో లేకుండా పోయిందని దెప్పిపొడియారు. మూసీ పేరుతో పేదల ఇండ్లనే కూల్చి రాక్షసానందం పొందుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి, ఉపాధి లేక బోసిపోయిన బెస్త వాడలపై ప్రేమ ఎందుకు ఉటుందని దుయ్యబట్టారు. హైడ్రా పేరుతో హైదరాబాద్ ఖ్యాతిని మంటగలుపుతున్న రేవంత్‌రెడ్డికి ముదిరాజ్ సోదరుల దీనస్థితిపై దయ లేకపాయెనని విమర్శించారు.

'ఇరిగేషన్'పై ఖమ్మం మంత్రుల పెత్తనం

- ఎవరికివారుగా సమీక్షలు
- పరస్పర విరుద్ధంగా ఆదేశాలు
- అదే అదునుగా ఇంజినీర్ల ఇష్టారాజ్యం
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు
- సీతారామ ఎత్తిపోతల పథకం టెండర్ల వివాదంతో వెలుగులోకి

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్ శాఖపై ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు పెత్తనం చెలాయిస్తున్నారు. ఎవరికి వారుగా సమీక్షలు నిర్వహిస్తూ పరస్పర విరుద్ధమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇదే అదునుగా వారి అండతో పలువురు ఇంజినీర్లు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం టెండర్లపై ఇటీవల నిర్వహించిన సమీక్షలో వివాదం చెలరేగడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6.50 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు తాగునీటిని అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారామ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది. రూ.7,926.14 కోట్ల అంచనాతో 2016 ఫిబ్రవరి 18న పరిపాలనా పరమైన అనుమతులిచ్చింది. ఆ తర్వాత 2018 ఆగస్టులో ఈ పథకం అంచనా వ్యయాన్ని రూ.13,057 కోట్లకు సవరించింది. అందులో ప్రాజెక్టు మెయిన్ కెనాల్‌తోపాటు సత్తుపల్లి ట్రంక్ కెనాల్, పాలేరు లింక్ కెనాల్ ఉన్నాయి. వాటితోపాటు 8 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులకు సంబంధించిన రూ.1,800 కోట్ల అంచనాలను ప్రభుత్వం ప్రభుత్వం ఆమోదించింది. వాటిలో ఇప్పటివరకు రూ.768 కోట్లు విలువ చేసే పనులకు మాత్రమే ఆమోదం తెలిపిన ఆర్థిక శాఖ.. ఇంకా రూ.1,074 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉన్నది. కానీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇరిగేషన్ సర్కిల్ అధికారులు మాత్రం మంత్రుల నోటిమాట ఆధారంగా ఆ పనులకు కూడా టెండర్లను ఆహ్వానించడం చర్చనీయాంశంగా మారింది.

ఎవరికి వారుగా సమీక్షలు

ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురు మంత్రులుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇరిగేషన్ పనులపై ఎవరికి వారుగా జిల్లా ఇంజినీర్లతో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌తో కలిసి వేర్వేరుగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. అలా ఒక్క సీతారామ ప్రాజెక్టు పనులపైనే పలుమార్లు వేర్వేరుగా సమావేశాలను నిర్వహించడం గమనార్హం. అందులో భాగంగా సెప్టెంబర్‌లోనూ ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సీతారామ ప్రాజెక్టు పనులకు ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపినందున తదుపరి అన్ని అనుమతులను సత్వరమే పూర్తి చేసి టెండర్లను ఆహ్వానించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ సమావేశంలో స్పష్టం చేశారు. కానీ, సంబంధిత ఇంజినీర్లు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. రూ.768 కోట్ల విలువైన డిస్ట్రిబ్యూటరీ పనులతోపాటు ఆర్థిక శాఖ ఆమోదం తెలపని రూ.1,074 కోట్ల విలువైన పనులకు సైతం టెండర్లను పిలిచారు. ఇదేమిటని ఉన్నతాధికారులు ప్రశ్నిస్తే.. పనుల్లో జాప్యం జరగరాదన్న మంత్రుల ఆదేశాల మేరకే టెండర్లను ఆహ్వానించామని, ఆ పనులను చేపట్టేందుకు అవసరమైన అనుమతులను తర్వాత పొందుతామని ఇంజినీర్లు దబాయిస్తున్నారు. దీనిపై తాజాగా మంత్రి ఉత్తమ్ నిర్వహించిన సమీక్షలో తీవ్ర దుమారం చెలరేగినట్టు తెలుస్తున్నది. అనుమతులేకుండా టెండర్లను ఎందుకు ఆహానించారని ఆయన నిలదీయడంతో జిల్లా మంత్రుల ఒత్తిడి మేరకే ఆ విధంగా చేయాల్సి వచ్చిందని ఇంజినీర్లు బదులిచ్చినట్టు సమాచారం.

ఈఎన్సీపై వేటుకు రంగం సిద్ధం?

ఆది నుంచి అన్ని అంశాల్లోనూ ఎంతో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ ఈఎన్సీ జనరల్ అనిల్ కుమార్ పట్ల పలువురు ప్రభుత్వ పెద్దలతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు, ఇంజినీర్లు గుర్రుగా ఉన్నట్టు ప్రచారం కొనసాగుతున్నది. పరిపాలన అనుమతులు పొందిన తర్వాతే టెండర్లను ఆహ్వానించాలని, అందుకు సంబంధించిన అంచనాలను రూపొందించి పంపాలని ఈఎన్సీ ఆది నుంచే స్పష్టంగా చెప్తున్నారు. కానీ, ఆ ఆదేశాలను ఇంజినీర్లు తుంగలో తొక్కి అనుమతుల్లేకుండానే టెండర్లను ఆహ్వానించడంతోపాటు నిబంధనల ప్రకారం ముందుకు పోవాలంటున్న ఈఎన్సీపై ఏకంగా ముఖ్యమంత్రికే ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీంతో ఈఎన్సీని తక్షణమే తొలగించాలంటూ ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో సీఎం ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తున్నది. అందుకు సంబంధించిన దస్త్రాలు ఇప్పటికే ఇరిగేషన్ శాఖ మంత్రి వద్దకు చేరినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇదంతా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రుల ప్రోద్బలంతోనే జరుగుతున్నట్టు ఇరిగేషన్ అధికారులు చర్చించుకుంటున్నారు.

రైతుకు బెదిరింపు

మొదటిపేజీ తరువాయి...

తెలిపాడు. తాను భూమి ఇవ్వనన్నందుకు తన ఇంటి ముందు ఎక్స్‌కవేటర్‌తో కందకం తీయించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదు మేరకు మీర్‌పేట పోలీసులు ఆదివారం సాయంత్రం గుర్రంగూడకు వచ్చి విచారణ చేస్తుండగా వారి ఎదుటే ప్రవీణ్‌రెడ్డి అనుచరులు తనను బూతులు తిడుతూ బెదిరించారని చెప్పాడు. తన ఇంటి ముందు కందకం తీయడం వల్ల బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందని, ఇదంతా భూమి ఇవ్వనన్నందుకే చేయిస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశాడు. తన తాతముత్తాల నుంచి ఆ భూమిపై ఆధారపడి బతుకుతున్నామని, తమ భూమి ఎవరికీ అమ్మే ప్రసక్తి లేదని చెప్పాడు. అవసరమైతే తమ భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవీణ్‌రెడ్డికి భూమి ఇచ్చేది లేదని తెలిపాడు. ఇప్పటికే బడంగ్‌పేట మున్సిపల్ అధికారులకు, మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశామని, ప్రవీణ్‌రెడ్డి అనుచరులు తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్టు తెలిపారు. వారిముందే బరి తెగించి మాట్లాడుతున్న సమయంలో మీర్‌పేట పోలీసులు విన్నారని, ఇదేం పద్ధతి అలా మాట్లాడొద్దని చెప్పారని వివరించాడు. బెదిరింపులకు పాల్పడుతున్న వారి నుంచి రక్షణ కల్పించాలని సర్సింహ వేడుకున్నాడు.

జవాన్లపై మావోయిస్టుల దాడి!

- ఆపై ఆయుధాల అపహరణ

కొత్తగూడెం క్రైం, నవంబర్ 3 : ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు జవాన్లపై మెరుపుదాడి చేసి, వారి ఆయుధాలను తస్కరించారు. ఈ ఘటన ఆదివారం జగర్గుండా మార్కెట్‌లో చోటుచేసుకున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జగర్గుండా మార్కెట్‌లో పహారా కాస్తున్న జవాన్లపై సివిల్ దుస్తుల్లో వచ్చిన మావోయిస్టు స్మాల్ యాక్షన్ టీమ్ మెరుపుదాడి చేసింది. సోడి, దేవా అనే జవాన్లపై మావోయిస్టులు పదునైన ఆయుధాలతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచి వారి వద్ద ఉన్న ఆయుధాలను ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న జగర్గుండా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన జవాన్లకు ప్రాథమిక చికిత్స నిర్వహించి, మెరుగైన చికిత్స నిమిత్తం ఎయిర్ లిఫ్ట్ ద్వారా రాయ్‌పూర్ దవాఖానకు తరలించారు.

కోదండరాంను నిలదీసిన 'పౌర సమాజం'

- 'మాటా ముచ్చట'లో ప్రభుత్వ గ్యారెంటీలపైనే చర్చ
- సర్కార్‌పై ఎందుకు పోరాడటం లేదని నిలదీసిన ప్రజాసంఘాలు
- వినకపోతే సర్కార్ గల్లాపట్టి అడిగే హక్కు ఉందన్న కోదండరాం

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జరిగిన 'పౌర సమాజంతో మాటా ముచ్చట'లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

మాట్లాడుతున్న మార్క రవీందర్

హుజూరాబాద్/హుజూరాబాద్ టౌన్, నవంబర్ 3: హామీల అమలుపై కాంగ్రెస్ సర్కార్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదని పలు ప్రజాసంఘాల నాయకులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఎమ్మెల్సీ కోదండరాంను నిలదీశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంటర్ హాల్‌లో 'పౌర సమాజంతో మాటా ముచ్చట' కార్యక్రమం లో పాల్గొన్న ఆయనకు.. పలు ప్రజాసంఘాల నాయకులు ప్రజా సమస్యలపై ఏకరువు పెట్టారు. పదవీ విరమణ చేసి ఐదు నెలలైనా పింఛన్ అందలేదని ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుడు మార్క రవీందర్ వాపోయారు. ఆర్టీసీ కార్మికులకు కనీసం గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తంచేశారు. లోక్‌సత్తా నాయకుడు గూడూరు స్వామిరెడ్డి మాట్లాడుతూ.. రూ. రెండు లక్షల రుణమాఫీ పూర్తి కాలేదని అన్నారు. రైతులకు బ్యాంకులు ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగి ఎర్రం పాపిరెడ్డి మాట్లాడుతూ.. హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఎందు కు అడగడం లేదని పలువురు కోదండరాంను ప్రశ్నించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన విధంగా ప్రజా సమస్యలపై ఎందుకు పోరాటం చేయడం లేదని నిలదీశారు. సాంస్కృతిక కళాకారుడు బాబ్జి మాట్లాడుతూ.. ఐదు నెలలకోసారి జీతం వస్తే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని పలువురు సూచించారు. హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఎందుకు అడగడం లేదని కోదండరాంను ప్రశ్నించారు. ఉద్యమం చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. కోదండరాం మాట్లాడుతూ.. ప్రభుత్వం సమస్యలు వినేందుకు సిద్ధంగా ఉన్నప్పుడు పోరాటం ఎందుకు చేయాలని ఎదురు ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ప్రభుత్వాన్ని గల్లా పట్టి అడిగే హక్కు ఉన్నదని స్పష్టంచేశారు.

రైతులకు సబిత భరోసా

మొదటిపేజీ తరువాయి...

ఆదివారం నాదర్‌గుల్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. భూమి ఇవ్వనందుకు ప్రవీణ్‌రెడ్డి మనుషులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, జేసీబీతో తమ ఇంటి ముందు కందకం తీయించారని, దీంతో బయటకు రావడం ఇబ్బంది అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్‌రెడ్డికి తమ భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. వారు ఎప్పుడొచ్చి తమపై దాడిచేస్తారో తెలియక బిక్కుబిక్కుమని బతుకుతున్నట్టు చెప్పారు. స్పందించిన సబిత వారికి అభయం ఇచ్చారు. రైతుల భూములను ఎవరూ బలవంతంగా లాక్కోలేరని తెలిపారు. మీ భూములు మీకు దక్కేలా చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని అభయమిచ్చారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే, ఆయనతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని సబిత భరోసా ఇచ్చారు.

ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గలేదు

- చట్టపరంగా వ్యవహరిస్తున్నం
- పోలీసులా? కీలుబొమ్మలా? కథనంపై రాచకొండ పోలీసుల స్పందన
- రెండు కేసులపై విచారణ కొనసాగుతున్నదని వెల్లడి
- 'నమస్తే తెలంగాణ'పై నాన్ బెయిలబుల్ సెక్షన్లు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : తాము ఎలాంటి ఒత్తిళ్లకు లొంగలేదని, తహసీల్దార్, గుర్రంగూడ రైతులు ఇచ్చిన రెండు వేర్వేరు ఫిర్యాదుల మేరకు అటు ప్రవీణ్‌రెడ్డిపై, ఇటు 'నమస్తే తెలంగాణ' దినపత్రికపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. 'పోలీసులా, కీలుబొమ్మలా?' అంటూ ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంపై రాచకొండ పోలీసులు స్పందించారు. సర్వే నంబర్ 92లోని అసైన్డ్ భూమిని డెవలప్‌మెంట్ కోసం రైతుల నుంచి ప్రవీణ్‌రెడ్డి అగ్రిమెంట్ చేసుకుంటున్నారని, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ పేరును కూడా దుర్వినియోగం చేస్తున్నాడని బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు. నిందితుల కాలంలో ప్రవీణ్‌రెడ్డి పేరు చేర్చలేదంటూ పత్రిక కథనంలో పేర్కొన్నారని, ఇది వాస్తవం కాదని, ప్రవీణ్‌రెడ్డి పేరును నిందితుల కాలంలో చేర్చామని తెలిపారు. ప్రవీణ్‌రెడ్డిని స్టేషన్‌కు పిలిపించి విచారించి, తగిన పత్రాలు సమర్పించాలని సూచించడంతో పాటు బాలాపూర్ మండల అధికారులను ఆ భూమికి సంబంధించిన రికార్డులు ఇవ్వాలని లేఖ ద్వారా కోరినట్టు వివరించారు. కథనంలో తమపై చేసిన ఆరోపణలు సత్యదూరంగా ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు. 'సర్వే నంబర్ 92లో దళితులు, బలహీన వర్గాలకు చెందిన సుమారు 200 మందికి ప్రభుత్వం అసైన్డ్ భూమి కేటాయించింది.. తరతరాలుగా ఆ పొలాలను సాగుచేసుకుంటున్నం.. హైదరాబాద్ సిటీ విస్తరణలో భాగంగా గత ప్రభుత్వంలో హెచ్ఎండీఏ అధికారులు మా వద్దకు వచ్చి ఆ భూమిని తీసుకొని అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పారు.. ఎకరానికి 700 గజాల స్థలం కావాలని కోరినం.. అనివార్య కారణాలతో ఆ ప్రతిపాదనలు ముందుకు వెళ్లలేదు. ల్యాండ్ పూలింగ్ చేస్తూ కొంత భూమిని మాకు కేటాయించాలని అధికారులను కలిసినం. ఈ క్రమంలో మేము భూములను అమ్ముకుంటున్నట్టు అసత్య కథనాలు ప్రచురించి మాకు నష్టం కలిగించారు' అని గుర్రం గూడ రైతులు 'నమస్తే తెలగాణ'పై ఫిర్యాదు చేసినట్టు పోలీసులు వివరించారు. ఈ మేరకు దినపత్రికపై కేసు నమోదుచేశామని వెల్లడించారు. మీర్‌పేట్ పోలీసులు ఈ రెండు కేసులను విచారిస్తున్నారని తెలిపారు. ఈ రెండు కేసుల విషయంలో పోలీసులు చట్టపరంగా వ్యవహరిస్తున్నారని, ఎలాంటి ఒత్తిళ్లకు తొలగ్గలేదని పేర్కొన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను లక్ష్యంగా చేసుకొని అసత్య, ప్రేరేపిత, పక్షపాత కథనాలు ప్రచురించిన పత్రికపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉహాజనిత సమాచారం ఆధారంగా పత్రికలో కథనాలు ప్రచురించవద్దని, ప్రజలు, రైతులను భయాందోళనలకు గురిచేయవద్దని కోరారు.

'నమస్తే తెలంగాణ'పై నాన్ బెయిలబుల్ సెక్షన్లు

నవంబర్ 1న కొందరు రైతులు చేసిన ఫిర్యాదు మేరకు 'నమస్తే తెలంగాణ' దిన పత్రికపై మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని 319(2), 338, 340(2), 353 (2), 61 (2) (ఏ), ఆర్/డబ్ల్యూ 3 (5) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. వీటిలో మూడు 338, 319(2), 353 (2) సెక్షన్లు నాన్ బెయిలబుల్. 338 సెక్షన్ ఆధారంగా జీవిత ఖైదు లేదా పదేండ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. 319(2) సెక్షన్‌లో ఐదేండ్ల జైలు శిక్ష లేదా జరిమానా ఒక్కోసారి రెండూ విధించే అవకాశం ఉన్నది. 353 (2) సెక్షన్‌లో మూడేండ్ల శిక్ష, జరిమానా, లేదా రెండూ విధించే అవకాశం ఉన్నది. అయితే, పత్రికలో వచ్చిన కథనాలకు, పెట్టిన నాన్ బెయిలబుల్ సెక్షన్లకు ఎలాంటి సంబంధం ఉన్నదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉద్యమకాలం నుంచి ఎన్నో కేసుల్లో కొట్లాడిన 'నమస్తే తెలంగాణ'కు ఈ కేసులు కొత్తేం కాదని, చివరికి న్యాయం గెలుస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

అంధకారంలో సింగరేణి భవిష్యత్తు

- హామీల పాతర.. నిబంధనల జాతర
- రోజుకో కొర్రీ.. పూటకో ఆదేశం
- సంస్థపై కార్మికుల ఆగ్రహం
- చోద్యంచూస్తున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు

పెద్దపల్లి, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): సింగరేణి తీరు అస్తవ్యస్తంగా మారింది. తెలంగాణ కొంగుబంగారంగా వెలుగులీనిన సంస్థలో పాలన గాడి తప్పుతున్నది. 'కార్మికులకు ఇది చేస్తాం.. అది చేస్తాం అని' ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు ప్రభుత్వాలు, సంఘాలు పాతరవేస్తుండగా, యాజమాన్యం రోజుకో ఆదేశం.. కొత్త ని బంధన తెస్తుండగా, కార్మికులు ఆగమవుతున్నారు. చోద్యం చూస్తున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల తీరుపై మండిపడుతున్నారు.

సంస్థ నిర్ణయాలతో కార్మికుల అవస్థలు

సింగరేణి సంస్థ నిర్ణయాలు కార్మికులను ఆగమాగం చేస్తున్నాయి. మార్పు మన మంచికే అని ఓట్లేసిన సింగరేణి కార్మికుల ఆశలు అడియాసలే అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్, ఇటు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఐఎన్‌టీయూసీ వదిలేయడంపై తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గుర్తింపు సంఘంగా, ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘాలుగా ఎన్నికైన విషయం తెలిసిందే. కొత్త సర్కారు కొలువు దీరిన నాటి నుంచి సింగరేణిలో అనేక రకాల కొత్త నిబంధనలు పుట్టుకురావడం, కొర్రీలు పెడుతుండటంపై కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెడ్‌కార్డ్, ఎల్లో కార్డు విధానం

ఎల్లో కార్డ్, రెడ్ కార్డు విధానాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో అమలు చేసింది. కార్మికులు రక్షణకు సంబంధించి తెలిసీతెలియక చేసే పొరపాట్లకు, ఏ చిన్న తప్పులకైనా ఈ కార్డులను వినియోగిస్తూ సింగరేణి కార్మికుల మొబైల్ ఫోన్లకు మెసేజ్‌ల ద్వారా పంపుతున్నది. దీనిపై కార్మికులు, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకించగా, యాజమాన్యం వెనక్కితగ్గింది.

సింగరేణికి ఆర్థిక భారం

ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి సింగరేణిలోని కొంత మంది ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయాలతో సంస్థ నష్టాలపాలవుతున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ కొలువుదీరిన తర్వాత సివిల్స్ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం' ప్రవేశపెట్టారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షల కంటే తక్కువ కలిగిన కుటుంబాల్లోని అభ్యర్థి ప్రిలిమినరీ పాసై, మెయిన్స్‌కు ప్రిపేరవుతుంటే రూ.లక్ష చొప్పున ఇచ్చేందుకు సింగరేణి రూ.4 కోట్లు కేటాయించింది. ఈ స్కీంలో సింగరేణి పేరు లేకపోవడం కార్మిక కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇటీవల అమెరికా, జపాన్ దేశాల్లో మైన్స్ ఎక్స్‌పో కార్యక్రమం జరగ్గా, ఆ కార్యక్రమానికి సింగరేణి సీఎండీతోపాటు అతికక్కువ మంది సింగరేణి అధికారులు వెళ్లారు. మంత్రి భట్టితోనూ ప్రభుత్వ అధికారులు చాలామంది వెళ్లారు. ఆ ఖర్చు దాదాపు రూ.3 కోట్ల వరకు సింగరేణి నుంచే ఖర్చు చేశారనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వంలో అన్ని పరీక్షలు ఉత్తీర్ణత సాధించిన 176 మంది జూనియర్ అసిస్టెంట్లు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే విధుల్లో చేరిన విషయం తెలిసిందే. ఆ ఉద్యోగాలను తమ ఖాతాల్లో వేసుకోవాలనే ఉద్దేశంతో రెండు రోజులు విధులు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ల సర్వీసును నిలుపుదల చేయించి, రెండు నెలల తర్వాత ఎల్‌బీ స్టేడియంలో భారీ సభను ఏర్పాటు చేసి వారికి నియామక పత్రాలను ఇవ్వడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. వారు రెండు నెలల జీతాలను నష్టపోవడంతోపాటు రెండు నెలల సర్వీస్ వృథాఅయ్యింది.

కార్మికులకు ఇబ్బందులు

సంస్థలో రోజురోజుకూ కొత్తగా పుట్టుకొస్తున్న నిబంధనలు కార్మికులను ఇబ్బంది పెడుతున్నాయి. కార్మికులు వరుసగా మూడు రోజులు విధులకు హాజరు కాకపోతే మళ్లీ విధుల్లో చేరేందుకు ఏరియా జీఎం నుంచి అలో స్లిప్ తీసుకోవాలనే కొత్త నిబంధన తెరమీదికి వచ్చింది. ఈ నిబంధన వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో సింగరేణిలో 15 వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు వచ్చిన విషయం తెలిసిందే. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ప్రతి ఒక్కరూ ఐదేండ్లపాటు అండర్ గ్రౌండ్‌లో పనిచేయాలనే నిబంధనను విధించారు. డిపెండెంట్ కింద ఎవరు చేరినా ఇది తప్పనిసరి అని నిర్ణయించడంపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

రెండు నెలలకో సిటీగా భాగ్యనగరం

- న్యూయార్క్, లండన్, ఇండోర్, సియోల్ చేస్తామన్న సీఎం
- గతంలో కేసీఆర్ విదేశీ నగరాలతో పోల్చితే కాంగ్రెస్ ఎద్దేవా
- ఇప్పుడు సగటున రెండు నెలలకో 'సిటీ'ని ప్రకటిస్తున్న రేవంత్

హైదరాబాద్, నవం